వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 264 శనివారం | 27 ఏప్రిల్ 2024 | పేజీలు : 06 | వెల రూ. 5



## మంత్రిని కలిసిన మేయర్

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖామాత్యులు కొండా సురేఖను శనివారం హైదరాబాద్‌లోని వారి నివాస గృహంలో వరంగల్ మహానగరపాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక రాయకీయాలపై ఇరువురు చర్చించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సుధారాణి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీకి బలం చేకూరింది.

– వరంగల్ వాయిస్, వరంగల్

# నాన్నే.. గెలిపిస్తాడు



వివరాలు 2లో..



**తనయ గెలుపుకు తండ్రి ఆరాటం**

**తన అనుభవాన్ని రంగరిస్తున్న కడియం**

**సీఎం రేవంత్ సభతో పెరిగిన గ్రాఫ్**

**ప్రచారంలో శ్రీహరిది ప్రత్యేక ముద్ర**

**ఆయన వ్యూహాలతో గెలుపు లాంఛనమే**

రాజకీయాల్లో రాణించాలంటే.. ఓ గాడ్ ఫాదర్ ఉండాలంటారు. ఆ గాడ్ ఫాదర్ సొంత తండ్రే అయితే? అన్నిటికీ ఆయనే ముందుండి నడిపిస్తే? ఇక ఆ వారసులకు తిరుగుండదు. ఇందుకు గతంలో చాలా ఉదాహరణలున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల సమరంలో వరంగల్ లోక్ సభ స్థానంలో ఇదే సీన్ కనిపిస్తోంది. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో రాణిస్తున్న సీనియర్ నేత కడియం శ్రీహరి.. ఈ ఎన్నికల్లో తన వారసురాలు డాక్టర్ కడియం కావ్యను బరిలో దింపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని మెప్పించి ఎంపీ టికెట్ ఇప్పించడంతో సరిపెట్టుకోకుండా.. ఆమె ఎన్నికల ప్రచారం, గెలుపు బాధ్యతలను కూడా కడియం శ్రీహరి తన భుజాలపై వేసుకున్నారు. ఇలా తండ్రి పరపతితో బరిలోకి దిగిన కడియం కావ్యను.. 'నాన్నే గెలిపిస్తాడు' అనే చర్చ ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తృతంగా జరుగుతోంది. నాన్న సూచనలతో ప్రచారంలో దూసుకుపోతోంది. పార్టీ శ్రేణులు, నాయకులతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించడంతోపాటు ప్రజలతో మమేకమవుతూ వారి మనిషిగా గుర్తింపు పొందుతున్నారు. దీంతో కడియం కావ్య గెలుపు నల్లేరుపై నడకే అన్న ప్రచారం సాగుతోంది. - వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి




2లో

## బీజేపీని ఓడిస్తేనే దేశంలో స్వేచ్ఛ

**దిగజారుడు రాజకీయాలు చేస్తున్న ఆ పార్టీ పెద్దలు**

**నా బిడ్డ ఎంపీగా గెలిచిన తర్వాత మంద కృష్ణ నా ఇంటికొచ్చి దండం పెడతాడు**

**కడియం శ్రీహరి హాట్ కామెంట్స్**



6లో

## ప్రజల పక్షాన నిలిచేది బీఆర్ఎస్ ఒక్కటే

**రేపు వరంగల్‌లో కేసీఆర్ రోడ్‌షో**

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**వేలాదిగా తరలి రావాలంటూ పిలుపు**





6లో

## ఓటింగ్ శాతం పెంచాలి

**స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాలు**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

# నాన్నే గెలిపిస్తాడు


వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..

**తనయ గెలుపుకు తండ్రి ఆరాటం**

**తన అనుభవాన్నిరంగరిస్తున్న కడియం**

**సీఎం రేవంత్ సభతో పెరిగిన గ్రాఫ్**

**ప్రచారంలో శ్రీహరిది ప్రత్యేక ముద్ర**

**ఆయన వ్యూహాలతో గెలుపు లాంఛనమే**

**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** వరంగల్ ఎస్సీ లోక్ సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ డిప్యూటీ సీఎం, ప్రస్తుత స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్య బరిలో దిగారు. వైద్యసేవతో పాటు సామాజిక సేవలోనూ కొంతకాలంగా నిమగ్నమైన ఆమె ఇటీవలే రాజకీయ రంగప్రవేశం చేశారు. ఆమెను క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావాలని భావించిన కడియం శ్రీహరి.. గత ఎన్నికల్లో వరంగల్ పార్లమెంటు, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే టికెట్ల కోసం కూడా ప్రయత్నాలు చేశారు. అయితే అప్పట్లో అవకాశాలు రాలేదు. ఈసారి కడియం కావ్య జాక్ పాట్ కొట్టిందనే చెప్పవచ్చు. బీఆర్ఎస్ నుంచి వరంగల్ ఎంపీగా పోటీచేసే ఛాన్స్ తొలుత ఆమెకు వచ్చింది. అయితే అధికారం కోల్పోయిన ఆపార్టీ నుంచి పోటీ చేస్తే... గెలుస్తామనే నమ్మకం లేకపోవడంతో కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు.

## అంతా తానై..

కడియం శ్రీహరి తన కూతురుతో కలిసి కాంగ్రెస్ లో చేరిన వెంటనే వరంగల్ లోక్ సభ స్థానం టికెట్ కైవసం చేసుకున్నారు. వెను వెంటనే కడియం కావ్య ప్రచార పర్వంలో నిమగ్నమయ్యారు. కడియం శ్రీహరికి పలు ఎన్నికల్లో పోటీచేసిన అపార అనుభవం ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు కూడా! ఆ నియోజకవర్గంతో పాటు పాలకుర్తి, పరకాల, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు వరంగల్ పార్లమెంటు పరిధిలో ఉన్నాయి. వీటన్నింటిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. అయితే కావ్యకు ఎన్నికల్లో పోటీచేసిన అనుభవం లేకపోవటంతో.. శ్రీహరి అంతా తానై ఎన్నికల ప్రచారాన్ని నడిపిస్తున్నారు.

## కావ్య గెలుపునకు వ్యూహాలు..

స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కూతురు కావ్య కోసం నానా తిప్పలు పడుతున్నారు. కూతురి రాజకీయ ఆరంగ్రేటం గెలుపుతోనే మొదలవ్వాలనే ఉద్దేశంతో పార్లమెంట్ టికెట్ సంపాదించేందుకు శ్రమించిన ఆయన.. ఇప్పుడు గెలుపు వ్యూహాలు రచించడంలో తలమునకలవుతున్నారు. తన నాలుగు దశాబ్ధాల రాజకీయ అనుభవాన్ని తన వారసురాలైన కడియం కావ్య గెలుపు కోసం ఉపయోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో తిరుగులేని నేతగా ఎదిగిన కడియం శ్రీహరికి అన్ని పార్టీల నాయకులతో సంబంధాలు ఉన్నాయి. ఆయా పార్టీలో తన అనుచరులు సైతం ఉన్నారు. ఇప్పుడు తన కూతురును గెలిపించేందుకు ఆయా పార్టీల్లో ఉన్న తన అనుచర గణం సాయం కూడా తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తను సంపాదించిన మంచిపేరు తన కూతురు గెలుపుకు పనికి వస్తుందని భావిస్తున్నారు. ప్రత్యర్థుల వ్యూహాలపై ఎత్తులు వేసి చిత్తు చేసే ఆయన రాజకీయ చతురత కూడా కలిసి వస్తోందని ఆశిస్తున్నారు.

## జీవన్మరణ సమస్య..

ఎంతో విలువనిచ్చినా, పదవులు కట్టబెట్టినా బీఆర్ఎస్ పార్టీని కాదని తన వారసురాలిగా కడియం కావ్యను నిలిపి గెలిచేందుకు కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిక వరకు బాగానే ఉన్నా, కూతురు కావ్య గెలుపు ఆయనకు జీవన్మరణ సమస్యగా మారింది. తన కూతురును చట్టసభల్లో కూర్చోబెట్టి తను రిటైర్ అవుతామని భావించిన కడియంకు అసలు చాలెంజ్ ఇప్పుడే ఎదురుకానుంది. కడియం కావ్యను గెలిపించుకోకపోతే అసలుకే మోసం వస్తుంది. ఎందుకంటే కడియం నాలుగు దశాబ్దాలుగా సంపాదించిన తన పరపతి ఈ ఓటమితో కోల్పోవాల్సి ఉంటుంది. అందుకే ఆయన ఎలాగైనా తన కూతురిని గెలిపించి తీరాలనే పట్టుదలతో ఉన్నారు. ప్రచారంలోనూ, ఎన్నికల మేనేజ్ మెంట్ లోనూ ఆయన ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ప్రచార పర్వాన్ని మాత్రం ఉరకలెత్తిస్తున్నారు.

## సీఎం సభతో పెరిగిన గ్రాఫ్..

వరంగల్ పార్లమెంట్ స్థానంలో గెలిచి తీరాలనే కసితో ఉన్న కడియం శ్రీహరి ఈ నెల 24న జన జాతర సభ పేరిట హనుమకొండలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ సభ విజయవంతం కావడంలో కాంగ్రెస్ పార్టీలో జోష్ మరింత పెరిగింది. ఇప్పటి వరకు కార్యకర్తల్లో ఉన్న నిరుత్సాహాన్ని సైతం సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగంతో తీసివేసినట్లైంది. కడియం కావ్య గెలుపుతో వరంగల్ నగరం మరింతగా అభివృద్ధి చెందుతుందని సీఎం హామీ ఇవ్వడంతో ఇక్కడి ప్రజలు సైతం కొంత ఆలోచనలో పడ్డారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు లాంచనమే అనే మాటలు వినిపిస్తున్నాయి.





వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..



# బీజేపీని ఓడిస్తేనే దేశంలో స్వేచ్ఛ

**దిగజారుడు రాజకీయాలు చేస్తున్న ఆ పార్టీ పెద్దలు**

**నా బిడ్డ ఎంపీగా గెలిచిన తర్వాత మంద కృష్ణ నా ఇంటికొచ్చి దండం పెడతాడు**

**కడియం శ్రీహరి హాట్ కామెంట్స్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నా బిడ్డ ఎంపీగా గెలిచిన తర్వాత ఇప్పుడు విమర్శిస్తున్న మంద కృష్ణ నా ఇంటికొచ్చి దండం పెడతాడంటూ మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాట్ కామెంట్స్ చేశారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని వారి స్వగృహంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యతో కలిసి వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ బీజేపీని ఓడిస్తేనే దేశంలో స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం నిలబడుతుందన్నారు. దేశ భవిష్యత్తుకు 2024 పార్లమెంట్ ఎన్నికలు కీలకం అన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ దేశానికి, రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్లు పరోక్షంగా ఎత్తివేసే కుట్ర చేస్తోందన్నారు. దేశం ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ పాలనలో దళితులపై, ముస్లింలపై, క్రైస్తవులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయన్నారు. తెలంగాణకు బీజేపీ వ్యతిరేకం కాబట్టే విభజన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఇక్కడ ఆ పార్టీ ఓటు అడిగే నైతిక అర్హత, హక్కు లేదన్నారు. పదేళ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఏడాదికి రెండు లక్షల చొప్పున రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. తెలంగాణ ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేని ఆ పార్టీ మత విద్వేషాలు రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని తహతహలాడు తుందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మంగళ సూత్రానికి భద్రత ఉండదంటూ ప్రధాని మోదీ అనడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ముస్లిం లీగ్ మేనిఫెస్టోగా పేర్కొంటున్నారన్నారు. కానీ మా మేనిఫెస్టో పంచ న్యాయ్ ద్వారా అణగారిన వర్గాల సంక్షేమం గురించి మాట్లాడుతుందన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి ప్రణాళికను మీ ముందు పెట్ట బోతోందన్నారు. గత ప్రభుత్వం పై వస్తున్న ఆరోపణలకు కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. కాళేశ్వరం బ్యారేజ్ లో పిల్లర్లు కుంగిపోవడానికి ఆయనే బాధ్యత వహించాలన్నారు. ఆయన అక్కడ కుర్చీ వేసుకొని నీళ్ళు వదిలితే కుర్చీతో పాటు ఆయన కూడా కొట్టుకు పోతారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కామన్ అన్న కేసీఆర్ అధికారులను బలి చేశాడని ఆరోపించారు. తన సామాజిక వర్గానికి చెందిన అధికారులను ఇరికించారన్నారు. కేసీఆర్ ప్రమేయం లేకుండానే వాళ్ళు ఫోన్ ట్యాపింగ్ చేశారా అంటూ ప్రశ్నించారు. హరీశ్ రావు పక్కా డ్రామా మాస్టర్ అంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ దుర్మార్గపు రాజకీయలను అడ్డుకోవడం ఒక్క కాంగ్రెస్ తోనే సాధ్యం అన్నారు. మే 13న కాంగ్రెస్ ఓటు వేసి బీజేపీ కి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## ప్రత్యేక ప్రార్థనలు..

ధర్మసాగర్ మండలం కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్ధన మందిరంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో డాక్టర్ కడియం కావ్య గొప్ప విజయం సాధించాలని కోరుతూ రెవరెండ్ డాక్టర్ సంఘాల పాల్సన్ రాజ్, రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాశ్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వచనములు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శైలజకు గౌరవ డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కరిమాబాద్ :** ఓరుగల్లుకు చెందిన మామిడాల శైలజ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి రాజనీతి శాస్త్ర విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించారు. శైలజ ప్రొఫెసర్ వి.రామచంద్రం పర్యవేక్షణలో 'ఉమెన్ ఎంపవర్మెంట్ త్రు 73,74 అమెండ్మెంట్' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు. స్వతహాగా రచయిత్రి అయిన శైలజ ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) నర్సంపేటలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా పరిశోధనలో సహకరించిన కుటుంబ సభ్యులు, మిత్రులు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందికి శైలజ కృతజ్ఞతలు తెలియజేశారు.



# ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆంగ్ల భాష బోధన తరగతులు

## ఆన్‌లైన్‌లో 40 రోజులు ఉచితం

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయులకు 40 రోజుల పాటు ఆన్ లైన్ లో ఉచితంగా ఆంగ్ల భాష బోధన తరగతులు నిర్వహించనున్నట్లు విల్ టు కెన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర పరిశోధన విద్యాసంస్థ వారి సహకారంతో విల్ టు కెన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా ఉపాధ్యాయులకు 40 రోజుల ఉచిత ఆన్ లైన్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక శ్రీ లీల గార్డెన్ లో అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాదాపు 150 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ తరగతుల యొక్క ముఖ్య ఉద్దేశం గవర్నమెంట్ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి కూడా తెలుగు మాట్లాడినట్టుగా ఇంగ్లీష్ మాట్లాడేట్టు చేయటమన్నారు. ఉపాధ్యాయులు ఎంతో శ్రద్ధగా తరగతులకు హాజరు కావడంపై వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

విల్ టు కెన్ సంస్థ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఇప్పటివరకు తెలంగాణలో 27 జిల్లాల్లోని దాదాపుగా 47 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఈ తరగతులను పూర్తి చేశామని, అలాగే ఎస్సీఈఆర్టీ సహకారంతో మొత్తం తెలంగాణలో మిగతా జిల్లాలకు కూడా క్లాసెస్ త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణలోని గవర్నమెంట్ స్కూల్లో చదివే ప్రతి విద్యార్థి కూడా తెలుగు మాట్లాడినట్టుగా ఇంగ్లీష్ మాట్లాడేటట్టు చేయటమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఈ అవకాశం ఇచ్చిన ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కు ఇంత మంచి సహకారాన్ని అందించిన ములుగు డీఈఓకు, ఏఎంఓకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు రామేశ్వర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గోశాలలో ప్రత్యేక పూజలు




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటరినెరియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కరీమాబాదులోని సీతారామస్వామి గోశాలలో ప్రత్యేక పూజలు చేయడంతోపాటు 50 గోవులకు కావాల్సిన పచ్చి గడ్డితోపాటు బలవర్ధకమైన టానికులు, క్యాల్షియం, మినరల్స్, మినరల్ మిక్సర్ ను అందజేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖలో 40 సంవత్సరాలు సుదీర్ఘ సేవ చేసి పదవీ విరమణ పొందిన వీఎల్ ఓ జుక్కోజు మోహన్, గోశాలలో గోవులకు సేవ చేస్తున్న సమ్మయ్య, కనకయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర టీఎన్ జీవీఏ అధ్యక్షుడు బింగి సురేష్, విశిష్ట అతిథిగా వరంగల్ జిల్లా టీఎన్ జీఓస్ జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, టీఎన్ జీవీఏ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, కార్యదర్శి ఎస్.సతీష్, జిల్లా సహ అధ్యక్షుడు ఎం.రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శుక్రుమియా, కె.కవి కుమార్, ఎన్.వెంకటయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కవితను గెలిపించాల్సిన బాధ్యత కార్యకర్తలదే

## మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పిలుపు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** కాంగ్రెస్ పార్టీ భాధ్యతలు చేపట్టిన వెంటనే రూ.2 లక్షల ఋణమాఫీ చేస్తుందనే అసత్య వాగ్దానానికి నమ్మిన ప్రజలు కాంగ్రెస్ కు ఓటేసరే తప్ప బీఆర్ఎస్ అంటే కోపంతో కాదని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. డోర్నకల్ మండలంలోని ఉయ్యాలవాడ, గుర్రలకుంట తండా, కస్నతండా, పాత దుబ్బతండా, గొల్లచర్ల, పెరుమండ్ల సంకీసా, ఫకిర తండా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మాలోతు కవితను గెలిపించాలని కోరుతూ శనివారం ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధు, రైతు బంధు, షాధిముభారక్ లాంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు. ప్రతి రైతుకు ఎకారనికి రూ.15 వేల రైతుబంధు అందిస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సాధ్యం కానీ ఆనేక హామిలు ఇచ్చి నేడు ఓట్ల కోసం ఓట్లు వేస్తున్నారని ఏద్దేవ చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఇల్లు తిరిగి గత ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాల ప్రజలకు వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాలోతు కవితను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలు నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు నున్న రమణ, ఉయ్యాలవాడ ఎంపీటీసీ నున్న మల్లికార్జున్, గోల్లచర్ల ఎంపీటీసీ కోటి శంకర్, సోసైటి అధ్యక్షలు భిక్షం రెడ్డి, జానకీ వెంకట్రాం, నున్నాభారతి జగన్, గమ్మి రాజు, సునీత వీరన్న, చిల్కోడు సామాజిక కార్యకర్త రామనబోయిన రాజు, పట్టణాధక్షులు విద్యాసాగర్, బోరగల శరత్, న్యాయవాది రమేష్, మన్యూ, చంటీ, గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద ఫాసిస్ట్ విధానాలను వ్యతిరేకించండి

## ఖిలా వరంగల్‌లో మేడే పోస్టర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా 138వ మే డేను జరపాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్ టీయూ జాతీయ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఖిలా వరంగల్ మధ్య కోటలో కార్మిక నాయకులు కార్యకర్తలు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ టీయూ, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్ మాట్లాడుతూ, నేడు దేశంలో మోడీ ప్రభుత్వం కార్మిక సంఘాల స్థాపన హక్కు, ఉద్యోగ భద్రత ఉపాధి కల్పన హక్కులను హరించి వేస్తున్నదని విమర్శించారు. అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం పోరాడి అమరులైన కార్మికులను స్మరించుకుంటూ ఈ మేడేను జరుపుకోవాలని జిల్లా కార్మిక వర్గాన్ని కోరారు. అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్ )రాష్ట్ర కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తన బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాలపై పోరాడుతున్న కార్మిక రైతాంగ ఇతర వర్గాల ప్రజలపై అణిచివేత కొనసాగిస్తున్నదని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా స్వతంత్ర పాలస్తీనా రాజ్యం కోసం పోరాడుతున్న ప్రజలకు సంఘీభావంగా ఈ మేడేను జరుపుకోవాలని ఆయన కార్మిక వర్గమును కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టీయూ నాయకులు గద్దల ప్రభాకర్, మన్నె నారాయణ, ఏలియా, రాజు,ఎండి అక్బర్, ఇనుముల కృష్ణ, బండి చంద్రమౌళి, గంద్రతి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మే 24 నుంచి సియాటెల్‌లో మెగా ఈవెంట్

## సీఎంను ఆహ్వానించిన టీటీఏ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మే 24 నుంచి 26 వరకు అమెరికాలోని సియాటెల్‌లో టీటీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా కన్వెన్షన్ కు హాజరు కావాల్సిందిగా కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానపత్రిక అందించారు. టీటీఏ ప్రెసిడెంట్ వంశీరెడ్డి కంచరకుంట్ల ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ ఎలెక్ట్ నవీన్ రెడ్డి మల్లిపెద్ది, కన్వెన్షన్ రీజనల్ అడ్వైజర్స్ డాక్టర్ ద్వారకానాథ రెడ్డి, నవీన్ గోలి, సీఈసీ ఈవీపీ డాక్టర్ ఎల్ఎన్ రెడ్డి దొంతిరెడ్డితోపాటు ఈసీ, బీవోడీ జ్యోతి రెడ్డి దూదిపాల, బీవోడీ దుర్గాప్రసాద్ సెలోజ్ లు శనివారం రేవంత్ రెడ్డిని కలిశారు. మెగా కన్వెన్షన్ కు రావాల్సిందిగా ఆహ్వానించారు. టీటీఏ ఆహ్వానానికి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. దీని కోసం తెలంగాణ రాజకీయ నాయకులను ఆహ్వానిస్తున్న టీటీఏ ఇప్పటికే పలువురిని స్వయంగా కలిసి ఆహ్వానం అందించారు.

# ఉపాధి హామీ పథకానికి తూట్లు

## డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్



**వరంగల్ వాయిస్, దామెర :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా, పెండింగ్ వేతనాలు చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టము-2006 ను నిర్వీర్యం చేస్తూ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్నారని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ విమర్శించారు. శనివారం దామెర మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతలతో సంబంధం లేకుండా కూలీలకు రూ.600 దినసరి కూలీగా చెల్లించాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా వేసవి భత్యం చెల్లించడం లేదన్నారు. 50శాతం వేసవి భత్యాన్ని చెల్లించి కూలీలను ఆదుకోవాలన్నారు. పని ప్రదేశంలో నీడ, తాగునీటి వసతి కల్పించాలని కూలీలకు తట్టా, గడ్డపార, పార మొదలగు పనిముట్లను ప్రభుత్వమే అందించాలని పని దినాలను 100 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించడానికి డీబీఎఫ్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీబీఫ్ జిల్లా నాయకులు పోలేపాక మల్లేశం, బాగాది వీరస్వామి, మంద శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటు తప్పక వేయాలి

**యువతకు ప్రేరణగా నిలవాలి**

**జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి**




**వరంగల్ వాయిస్, ములుగు :** దివ్యాంగులు వయోవృద్ధులు ఓటు హక్కును తప్పక వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి కోరారు. శనివారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో పార్లమెంట్ లోక్ సభ ఎన్నికలు-2024 స్వీప్ కార్యక్రమములో భాగంగా దివ్యాంగులు, వయోవృద్ధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అనునది ఓటు హక్కు ద్వారా మాత్రమే సాధ్యమని, ఓటు హక్కు మన ప్రాథమిక బాధ్యత అని గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటు వేయడం అత్యంత ముఖ్యమన్నారు. ప్రజల చేత ప్రజల కొరకు ఎన్నుకోబడే ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యం అంటారని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలలో మన దేశం ఒకటని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీడబ్లూడీఎస్ నోడల్ అధికారిని, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, స్వీప్ నోడల్ అధికారి, డీఆర్ డీఓ శ్రీనివాస్ కుమార్, సీడీపీఓ మల్లీశ్వరి, స్వాతి, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కరి నేత్రదానం.. ఇద్దరు అందులకు చూపు

**నేత్ర, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఒక్కరి నేత్రదానం..ఇద్దరు అందులకు చూపునిస్తుందని నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా గోపాలపూర్ భద్రకాళి నగర్ రోడ్ నెంబర్ 2లో నివాసముంటున్న పొనుగోటి సరళా అనారోగ్యంతో మరణించగా ఆమె కుమారులు విధ్యానాథరావు, శ్రీనాథరావు, హరినాథరావు అనుమతితో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది, ఎల్ వీ ప్రసాద్ నేత్ర సేకరణ నిపుణులు నరేందర్ నేత్ర సేకరణ చేశారు. ఈ నేపథ్యంలో సరళ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపి నేత్ర దాన సర్టిఫికెట్ అందజేశారు. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి కోరారు. ఇతర వివరాలకు 8790548706 సెల్ లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు వి.ప్రకాష్ రావు, జనార్ధన్ రెడ్డి, జితేందర్ రెడ్డి, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శంకర్రావు యాదవ్, రాజమౌళి, ఉపేందర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, అనంతల కేదారి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను గెలిపించండి

# రాజ్యాంగాన్ని పరిరక్షించండి

**ఆచార్య కూరపాటి వెంకటనారాయణ**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశ భవిష్యత్తును నిర్ణయించే పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో ప్రజల ఆర్థిక సమస్యలు చర్చించాలని, గత పది సంవత్సరాల నుంచి అమలు చేసిన విధానాల పర్యవసానాలు దుష్ఫలితాలను ఎత్తిచూపాలని ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ కాన్ఫరెన్స్ లో ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికలు ప్రజల ఆర్థిక సామాజిక సమస్యల పరిష్కారానికి, కార్పొరేట్ సంస్థల దోపిడీ వ్యవస్థలకు మధ్యన అని భావించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గత పది సంవత్సరాలుగా నరేంద్ర మోడీ పాలనలో పేద వర్గాలు మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి వేయబడ్డారని, దేశంలో ఎన్నడూ లేనంత స్థాయిలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని విద్యావంతులైన యువతీ, యువకులు ఉద్యోగాలు లభించక సాంఘిక భద్రత లేక ఆశాంతికి గురి అవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత పది సంవత్సరాల నుంచి ప్రైవేటు విద్యాసంస్థలను, యూనివర్సిటీలను ప్రోత్సహించడంతో దేశంలో 90 శాతం మంది ఉన్నత విద్యకు దూరం అవుతున్నారన్నారు. మళ్లీ మోడీని గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చి ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర పేద వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్లు కూడా తీసివేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకోసం రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు, కేంద్రంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడి ఐదు గ్యారెంటీలు అమలు చేయించుకునే బాధ్యత ఈ రాష్ట్ర ప్రజలపై ఉందని దానికోసం కాంగ్రెస్ ను గెలిపించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు, కాకతీయ యూనివర్సిటీ, జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్, దయాల సుధాకర్ బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గునిగంటి శ్రీనివాస్ గౌడ్ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్, ముంజాల బిక్షపతి గౌడ్ ప్రజా సంఘాల ములుగు జిల్లా అధ్యక్షులు గూడూరు మహిపాల్ రెడ్డి , ములుగు జిల్లా జర్నలిస్టుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ సొసైటీ, నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి హనుమకొండ కలెక్టరేట్ సమీపంలోని రెడ్డి సంక్షేమ సంఘం అనాథ బాలికల కళాశాల వసతిగృహాం విద్యార్థులకు ఉచితంగా లాంగ్ నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసినవారు వేసవిలో కాంపటీటివ్ పరీక్షలు, గ్రూప్స్ కు ప్రిపేర్ అవుతున్న నేపథ్యంలో ఈ లాంగ్ బుక్స్ ఎంతో దోహదపడుతాయన్నారు. పిల్లలు ఒక లక్ష్యం పెట్టుకొని చదువడం ద్వారా ఆశించిన లక్ష్యాలకు చేరుకుంటారన్నారు. అనంతరం పిల్లలకు, సిబ్బందికి వినియోగదారుల చట్టం గురించి డాక్టర్ అనితా రెడ్డి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వినియోగదారపు మెలకువలు నేర్చుకోవాలన్నారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా తప్పకుండా రసీదు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, కుందూరు రమేష్ రెడ్డి, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీసీ డిక్లరేషన్ అమలుకు పోరాడుదాం..

**ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనతో పాటు ప్రకటించిన ఇతర సంక్షేమ, అభివృద్ధి అంశాలను సాధించడం కోసం బీసీలు ఐక్య ఉద్యమానికి సిద్ధం కావాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ అధ్యక్షతన జరిగిన సామాజిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి ఎన్నో పోరాటాలు చేయడం వల్ల మండల్ కమీషన్ నివేదికలో సూచించబడిన 40 అంశాల్లో ఒక్కటైనా విద్యా, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించారని, దానికి అనుగుణంగా ఆయా రాష్ట్రాల్లో బీసీలకు స్థానిక సంస్థల్లో కల్పించిన రిజర్వేషన్లు ఒక్కొక్క రాష్ట్రం ఒక్కో విధంగా అమలుపరుస్తూ స్థానిక సంస్థల రిజర్వేషన్లలో హెచ్చు తగ్గులకు పాల్పడ్డారన్నారు. తెలంగాణలో కూడా గతంలో ఉన్న స్థానిక సంస్థల రిజర్వేషన్లను తగ్గించారని, ఈ సందర్భంగా ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి ప్రణాళికలు కామారెడ్డిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ లో ప్రకటించి నాలుగు నెలలు దాటినా వాటి ఊసే లేకపోవడం బాధాకరమన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్, బీసీ టైమ్స్ ఎడిటర్ సంగెం సూర్యారావు, హిందూ బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్లు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తం, బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ అధ్యక్షులు పాలూరు రామకృష్ణ, ఆల్ ఇండియా ఓబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు కిరణ్ కుమార్, ఎంసీటీసీల ఫోరం అధ్యక్షులు కరుణాకర్, వివిధ సంఘాల నాయకులు పటేల్ వనజ, కరుణశ్రీ, మేక లలిత యాదవ్, ఎ.మహేందర్, చెన్న శ్రీకాంత్ నేత, వెంకటరమణ, న్యాయవాది రమేష్ యాదవ్, మేకల రాజేందర్ యాదవ్, దేశం మహేష్, లింగం శాలివాహన తదితరులు పాల్గొని మాట్లాడారు.

# ఓటు హక్కు వినియోగంపై అవగాహన



**వరంగల్ వాయిస్, నయీంనగర్ :** మహాత్మా గాంధీ టెంపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగం పై మే నెల ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమానికి కన్వీనర్ గా రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణును నియమిస్తూ మహాత్మా గాంధీ టెంపుల్ చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ నియామక ఉత్తర్వులను జారీ జేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతు రెండు తెలుగు రాష్ట్రాల్లో గత ఎన్నికలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన జిల్లాలలో మహాత్మా గాంధీ టెంపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మన వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలలో ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.




# అంచనాలను తలకిందులు చేసిన రత్నం

## కథాకథనాలలో కానరాని సీక్వెన్స్


దర్శకుడు హరి సినిమా అనగానే యాక్షన్ ప్రియులు ఉత్సాహంగా ఎదురు చూస్తుంటారు. 'సింగం' సినిమాలతో ఆయన చూపించిన ప్రభావం అలాంటిది. విశాల్‌తో ఆయన చేసిన 'భరణి', 'పూజ' సినిమాలు కూడా మంచి విజయాల్ని సొంతం చేసుకున్నాయి. కొంత విరామం తర్వాత ఈ కలయికలో రూపుదిద్దుకున్న చిత్రమే.. 'రత్నం'. ప్రేక్షకుల్లో మంచి అంచనాల్ని సృష్టించి... ప్రచార చిత్రాలతో ఆసక్తిని రేకెత్తించిన ఈ సినిమా విడుదల అయ్యింది. తమిళనాడు, ఆంధ్ర సరిహద్దుల్లో సాగే కథ ఇది.



లక్ష్యం కోసం హత్యలు చేయడానికైనా వెనకాడని యువకుడు రత్నం (విశాల్). తాను మావయ్య అని పిలుచుకునే ఎమ్మెల్యే పన్నీర్‌స్వామి (సముద్రఖని) అండతో అప్పుడప్పుడూ చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుంటూ పనులు చక్కబెడుతుంటాడు. పోలీసులకి సగం సమస్యల్ని తగ్గిస్తుంటాడు. ఎమ్మెల్యేకి కుడి భుజంలాంటి రత్నం జీవితంలో ఎన్నో కల్లోలాలు. చిన్నప్పుడే తల్లి రంగనాయకి పోలీస్‌స్టేషన్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంటుంది. అతని బాల్యం కొంతకాలం జైల్లో గడుస్తుంది. అలాంటి రత్నం జీవితంలోకి మల్లిక (ప్రియభవానీ శంకర్) వచ్చాక కొత్త పరిణామాలు చోటు చేసుకుంటాయి. తమిళనాడులోని తిరుత్తణిని అడ్డాగా చేసుకుని ఎన్నెన్నో అరాచకాలకు పాల్పడుతుంటారు లింగం బ్రదర్స్ (మురళీశర్మ, హరీష్ పేరడి). వాళ్లే మల్లికపై హత్యాయత్నం చేయగా, రత్నం కాపాడతాడు. ఇంతకీ మల్లిక ఎవరు?ఆమెని లింగం బ్రదర్స్ చంపాలనుకోవడానికి కారణం ఏమిటి?మల్లికని కాపాడేందుకు రత్నం ఏం చేశాడు? అసలు రత్నం తల్లి రంగనాయకి పోలీస్‌స్టేషన్‌లో ఎందుకు ఆత్మహత్య చేసుకుందన్నదే కథ. హరి సినిమా అంటేనే ఫక్తు మాస్ కథ, వీరోచితమైన పోరాటాలు, పరుగులు పెట్టే సన్నివేశాలే గుర్తొస్తాయి. ఇక విశాల్‌తో ఆయన జట్టు కట్టారంటే ఆ కథ, కథనాలు ఎలా ఉంటాయో ప్రేక్షకులు ముందే ఓ అంచనాకొస్తారు. ఆ ఇద్దరి కలయికలో ఇదివరకు వచ్చిన సినిమాలు అలాంటివి. అదే టెంప్లేట్‌తో సాగే కథతోనే... మాస్, యాక్షన్, సెంటిమెంట్ అంశాల్ని ఇంకాస్త అప్‌గ్రేడ్ చేస్తూ ఈ సినిమాని మలిచారు దర్శకుడు హరి. 90వ దశకంతో కథని మొదలుపెడుతూ, ఆరంభ సన్నివేశాలతో పాత్రల్ని పరిచయం చేశారు. ఆ పని పూర్తయ్యాక అసలు సిసలు హరి మార్క్ సన్నివేశాలు షురూ అవుతాయి. (ఖీజీబిరనిజీప పనీలతి। స।లతి।లి) ఛేజింగ్‌లు, యాక్షన్ ఘట్టాలతో సన్నివేశాలు పరుగులు పెడతాయి. మల్లిక పాత్ర పరిచయం, ఆమెపై హత్యాయత్నంతో కథలో మలుపులు చోటు చేసుకుంటాయి. లింగం బ్రదర్స్ అరాచకాలు, మెడికల్ కాలేజీ వ్యవహారమంతా సాదాసీదాగా పాత సినిమాల్నే గుర్తు చేసినా, విరామం తర్వాత కథలో చోటు చేసుకునే మలుపులు సినిమాని ప్రత్యేకంగా మార్చాయి. అయితే అవేవీ వాస్తవానికి దగ్గరగా అనిపించవు. సినిమాలో ఓ చోట కథానాయకుడితో సముద్రఖని 'కలలో కూడా ఊహించలేనివి నీ జీవితంలో జరిగాయి' అంటాడు. ఆ మాటకి తగ్గట్టుగానే ఈ కథ ఎక్కడా సహజంగా అనిపించదు. ఏ పాత్రతోనూ సగటు ప్రేక్షకుడు కనెక్ట్ కాలేని పరిస్థితి. కథలో మలుపుల పేరిట బలవంతంగా సన్నివేశాలు రాసినట్టు అనిపిస్తుందే తప్ప, వాస్తవానికి దగ్గరగా ఉన్నట్టు అనిపించదు. కథ ముగుస్తుందనుకున్న ప్రతిసారీ మరో అంకం మొదలవుతుంది. ఇదంతా సాగదీత వ్యవహారమే. హీరో, హీరోయిన్ మధ్య బంధాన్ని ఆవిష్కరించిన తీరు కొత్తగానే ఉన్నా అవి ప్రేక్షకుడికి ఆమోదయోగ్యం అనిపించదు. ద్వితీయార్ధంలో హీరో తల్లి నేపథ్యంలో వచ్చే ఎపిసోడ్, ఓ బ్రాహ్మణ కుటుంబంతో ముడిపెట్టిన విధానం సెంటిమెంట్ పరంగా ఆకట్టుకుంటుంది. పతాక సన్నివేశాలు పర్వాలేదనిపిస్తాయి. కాలం చెల్లిన కథకి, బలవంతంగా కొన్ని మలుపుల్ని జోడించి తీసిన సినిమా ఇది.

# శివభక్తురాలిగా తమన్నా

సంపత్ నంది కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా చిత్రం ఓదెల 2 . మిల్కీ బ్యూటీ తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తోంది. అశోక్ తేజ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే మేకర్స్ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఓం నమ: శివాయ.. అంటూ తమన్నా శివశక్తి లుక్ షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో తమన్నా మహదేవ్‌కు పరమభక్తురాలిగా, ఓదెల సద్గుణ రక్షకురాలిగా కనిపించనుందని తెలియజేశారు. ఓదెల ప్రపంచం నుండి శివశక్తికి సంబంధించిన ఎక్జయిటింగ్ న్యూస్ రాబోతుందని ప్రకటించారని తెలిసిందే. తాజాగా తమన్నా శివశక్తి రూపంలోకి ఎలా మారిందని తెలియజేస్తూ.. మేకింగ్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతూ.. సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. ఓదెల 2 సెకండ్ షెడ్యూల్ షూట్ మొదలైంది. ఓదెల 2 చిత్రంలో వశిష్ఠ ఎన్ సింహా, హరిప్రియ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్, మధు క్రియేషన్స్‌పై తెరకెక్కిస్తున్నారు. కాంతార చిత్రానికి గూస్‌బంప్స్ తెప్పించే మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూర్చిన అజనీష్ లోక్‌నాథ్ ఈ మూవీకి సంగీతం అందిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఓదెల 2 షూటింగ్‌ను ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం కాశీలో మొదలుపెట్టారని తెలిసిందే. ఈ ఫొటోలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో హల్ చల్ చేస్తున్నాయి.







# మలయాళ సినిమాల హవా

టాలీవుడ్‌లో ప్రస్తుతం మలయాళ సినిమాల హవా నడుస్తుందన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఏడాది వచ్చిన ప్రేమలు, మంజుమ్మెల్ బాయ్స్, భ్రమయుగం తెలుగులో మంచి కలెక్షన్లు సాధించాయి. చిన్న కాన్సెప్ట్‌తో తీసిన ఈ సినిమాలు కేవలం మలయాళ ప్రేక్షకులనే కాదు..అందర్నీ మెప్పిస్తున్నాయి. అందుకే మనవాళ్లు మలయాళ సినిమాలను రీమేక్ చేయడంపై ఆసక్తి చూపిస్తున్నారు. అయితే మలయాళంలో సూపర్ హిట్ అయిన మరో సినిమా తెలుగు ఓటీటీలోకి రాబోతుంది. కరోనా సెకండ్ వేవ్ టైంలో మలయాళంలో వచ్చిన చిత్రం నయట్టు. 2021లో కరోనా వలన థియేటర్‌లు మూసి ఉండడంతో ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో నేరుగా విడుదలై మంచి హిట్ అందుకుంది. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ సినిమాను తెలుగులో కోటా బొమ్మాళిఅంటూ రీమేక్ చేశారు. అయితే కోటా బొమ్మాళి ప్రస్తుతం ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుండగా.. ఒరిజినల్ వెర్షన్ నయట్టును మళ్లీ తెలుగులోకి తీసుకువస్తుంది ఆహా. ఈ సినిమాను చుండూరు పోలీస్ స్టేషన్ అనే పేరుతో తీసుకువస్తుంది. ఏప్రిల్ 26 నుంచి ఆహాలో ఈ సినిమా స్ట్రీమింగ్ కానున్నట్లు ప్రకటించింది. ఇక సినిమా కథ విషయానికి వస్తే.. తాము చేయని హత్య కేసులో ముగ్గురు పోలీసు అధికారులు చిక్కుకుంటారు.ఈ కేసు నుంచి వాళ్లు బయటపడతారా? లేదా? చివరకు వాళ్ల జీవితం ఎలా మారింది? అనే కథాంశం చుట్టూ ఈ చిత్రం తిరుగుతుంది. కుంచాకో బోబన్, జోజు జార్జ్, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు మార్టిన్ ప్రక్కత్ దర్శకత్వం వహించాడు.




# పట్టణ ఓటింగ్ శాతం పెరగాలి

## విద్యార్థులతో ప్రతిజ్ఞ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ 30 రోజులపాటు నిర్వహించనున్న ఓటర్ అవేర్ నెస్ కార్యక్రమంలో భాగంగా శనివారం హనుమకొండ వాగ్దేవి ఫిజియోథెరపీ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రికార్డ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు కుసుమ సురేష్ కళాశాల ప్రిన్సిపల్ సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో మే 13న జరిగే లోక్ సభ ఎన్నికల్లో తప్పకుండా ఓటు వేస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఓటు హక్కే కాదు బాధ్యత అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిరంజీవి, డాక్టర్ రాజనరేంద్ర, డాక్టర్ సాయి కిరణ్, నిధి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన నిలిచేది బీఆర్ఎస్ ఒక్కటే

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**వరంగల్ వాయిస్, తొర్రూరు:** బీఆర్ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం తొర్రూరు మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కేక్ కట్ చేసి ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వరంగల్ రోడ్ షో సన్నాహక సమావేశాన్ని తొర్రూరు మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సన్నాహక సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ శాసనసభ సభాపతి సిరికొండ మధుసూదనా చారి మాట్లాడుతూ..కేసీఆర్ రోడ్ షోకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చల్లగా ముందుకుపోతున్న రాష్ట్రాన్ని ఆగం చేసిన ఈ కాంగ్రెస్ మెడలు వంచి.. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జల దృశ్యం నుంచి జన దృశ్యంగా మారిన పరిణామంలో ఎన్నో ఎత్తుపల్లాలు, ఎన్నో ఒడిదుడుకులు, ఎన్నో అవహేళనలు, ఎన్నో అవమానాలు ఎదురైనా 23 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో కేసీఆర్ ఎన్నడూ ఎత్తిన జెండాను దించలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, అన్నివర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. తెలంగాణకు నష్టం జరిగిన ప్రతిసారి బీఆర్ఎస్ గొంతెత్తి నినదించిందన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేసిందన్నారు. ఇప్పుడు మరోసారి ప్రజల పక్షాన ప్రజా ఉద్యమం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ సంసిద్ధమైందని గుర్తు చేశారు.

# ఓటింగ్ శాతం పెంచాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్యపర్చే విధంగా విభిన్న కార్యక్రమాలను నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేలా స్వీప్ ఆధ్వర్యంలో చేపట్టిన, చేపట్టనున్న కార్యక్రమాలపై స్వీప్ కోర్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఓటింగ్ శాతాన్ని పెంచేవిధంగా స్వీప్ ఆధ్వర్యంలో ముఖ్యంగా పట్టణ ప్రాంతంలో ఓటింగ్ శాతాన్ని పెంచేవిధంగా ఓటరు చైతన్య కార్యక్రమాలు రెండు వారాల్లో విరివిగా చేపట్టాలన్నారు. పోలింగ్ తేదీ, ఓటు వేయడం, ఓటు ప్రాముఖ్యత ను తెలియజేస్తూ ఓటింగ్ శాతం పెరిగేందుకు సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం సాగించాలన్నారు. ఈ సందర్భంగా స్వీప్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేపట్టిన, ఇకముందు చేపట్టనున్న కార్యక్రమాల గురించి అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస రావు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు నారాయణ, వెంకటేష్, , స్వీప్ కమిటీ సభ్యులు డీపీవో లక్ష్మీ రమాకాంత్, సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భానుప్రసాద్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై, డీఎంహెచ్ వో డాక్టర్ సాంబశివరావు, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీఐఈవో గోపాల్, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ అశోక్ కుమార్, మెప్మా డీఎంసీ రజిత రాణి, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు అండగా నిలుస్తాం..

## తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో 'తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్' బాధ్యులు, సభ్యులు శనివారం హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా కార్మిక, కర్షక వర్గాల శ్రేయస్సు, వికాసమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 'శ్రామిక్ న్యాయ్' విప్లవాత్మకమైనదని అసోసియేషన్ సభ్యులు అభిప్రాయపడ్డారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచే కాంగ్రెస్ పార్టీ విజయానికి అంతా ఏకమై ముందుకు సాగుతామని ప్రకటించారు. తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అంజిరెడ్డి, చైర్మన్ రామినేని శ్రీనివాస రావు, వైస్ ప్రెసిడెంట్ జగన్నాథ్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ బారి, జనరల్ సెక్రటరీ దుర్గా ప్రసాద్, ట్రెజరర్ గణేష్ యాదవ్, ముఖ్య సలహాదారు ఆవుల రామారావు, జాయింట్ సెక్రటరీ షకీల్ అహ్మద్ ( గోరా భాయ్), గద్దం యుగేందర్ గౌడ్ తదితరులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



# రక్తంతో సీఎం చిత్రపటం

## తోట పవన్‌ను అభినందించిన రేవంత్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరానికి చెందిన కాంగ్రెస్ యువనేత తోట పవన్ స్వయంగా తన రక్తంతో సీఎం రేవంత్ రెడ్డి చిత్రాన్ని వేశారు. ఈ నెల 24 వ తేదీన మడికొండలో జరిగిన ఓరుగల్లు జన జాతర మహా సభలో సీఎం రేవంత్ రెడ్డికి కానుకగా తను వేసిన చిత్ర పటాన్ని అందజేశారు. చిత్ర పటాన్ని చూసిన సీఎం పవన్ ను అభినందించారు. ఈ సందర్భంగా తోట పవన్ మాట్లాడుతూ గతంలో తనపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేసిన సమయంలో రేవంత్ రెడ్డి హాస్పిటల్ కి వచ్చి పరామర్శించి ఎంతో ధైర్యాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. అప్పటి నుంచి రేవంత్ కు వీరాభిమానిగా మారానని కాంగ్రెస్ యువనేత తోట పవన్ అన్నారు.

# కాళోజీ అదనపు బ్రాంచ్‌లను మూసివేయాలి

## అడిషనల్ కలెక్టర్‌కు ఐక్య విద్యార్థి సంఘాల వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఒక పర్మిషన్ తీసుకొని అదనంగా మరో రెండు బ్రాంచ్ లు నడుపుతూ ఇటు ప్రభుత్వాన్ని అటు విద్యార్థులను మోసం చేస్తూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నటువంటి కాళోజీ కళాశాల యాజమాన్యంపై చీటింగ్ కేసు నమోదు చేయాలని కోరుతూ హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డికి శనివారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. చింతగట్టు ప్రాంతంలోని కాళోజీ జూనియర్ కళాశాలలో వేసవి సెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతి లేని బ్రాంచ్ లను మూసివేయాలంటూ ఈనెల 20వ తేదీన జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారి డీఐఈఓ గోపాల్ దృష్టికి తీసుకో పోయినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఐక్య విద్యార్థి సంఘాలు నాయకులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్, ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, టీఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కన్నం సునీల్, టీఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ బైరపాక ప్రశాంత్, బీఎస్ ఎఫ్ నాయకులు బొట్ల మనోహర్, ఏబీఎస్ ఎఫ్ నాయకులు మచ్చ పవన్, ఎస్ ఎస్ యూ నాయకులు ఎల్తూరి సాయిలు, అభిషేక్, చెన్నూరి సాయి, నాగారం మనితేజ, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com